నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 22 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM

ఆనంద వర్షం

జిల్లావ్యాప్తంగా కురిసిన వాన
మురిసిపోతున్న రైతులు

ఖమ్మం, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లావ్యాప్తంగా శనివారం కురిసిన వర్షం అన్నదాతలను ఆనందంలో ముంచెత్తింది. సీజన్ ప్రారంభమై పక్షంరోజులు దాటినా వాన జాడ లేక పోవడంతో ఆందోళనలో ఉన్న రైతుల మోముల్లో ఒక్కసారిగా వెలుగులు విరజిమ్మాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా ఇప్పటికే 1.20 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పనులు పూర్తిచేశారు. ఇప్పటికే వేసిన పత్తి గింజలు మొలకెత్తకపోవడంతో చాలామంది రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా జూన్ మొదటివారానికే వర్షాలు పలకరిస్తుంటాయి. కానీ ఈ ఏడాది మొహం చాటేశాయి. రెండువారాలుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు.. వానదేవుడిపై భారం వేసి విత్తనాలను నాటారు. ఈ క్రమంలో శనివారం వాన నేలను పలకరించడంతో రైతులు ఆనందంతో మురిసిపోతున్నారు.

బస్సెక్కితే బాదుడే!

- ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న ఆర్టీసీ
- టోల్ రూట్లలో బస్సు చార్జీలు పెంపు
- టోల్‌కు రూ.10 చొప్పున పెంచిన రేవంత్ సర్కార్
- విద్యార్థుల బస్సుపాస్‌లపై 20 శాతం అదనపు భారం
- రేట్లు తగ్గించాలని ప్రయాణికుల డిమాండ్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) సామాన్యుడి నడ్డి విరుస్తున్నది. చదీచప్పుడు కాకుండా పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం మోపింది. టోల్‌ప్లాజా ఉన్న రూట్లతోపాటు విద్యార్థుల నెలవారీ బస్సుపాస్‌లపై అదనపు చార్జీలను వసూలు చేస్తున్నది. ఖమ్మం రీజియన్ పరిధిలో గల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8 డిపోలు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, ఇల్లెందు, మణుగూరు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే ప్రయాణికుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో వీరందరిపై అదనపు భారం పడింది. వీరితోపాటు ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, పాల్వంచ తదితర పట్టణాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు చదువు నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. వీరందరిపై కూడా 20 శాతం చార్జీలను పెంచి అదనపు భారం మోపింది.

- ఖమ్మం, జూన్ 21

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 8 ఆర్టీసీ డిపోల పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ తదితర అన్నిరకాల బస్సులు 560 వరకు ఉన్నాయి. ప్రతిరోజు ప్రయాణికుల కోసం కొన్ని వేల కిలోమీటర్లు ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నది. మొత్తం బస్సుల్లో 35 శాతం కేవలం హైదరాబాద్‌కు సర్వీసులు నడుస్తున్నాయి. ప్రతిరోజు ఖమ్మం రీజియన్ పరిధిలో 2 లక్షల 65 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తే.. దీనిలో హైదరాబాద్‌కు వెళ్లివచ్చే వారే 1 లక్షా 35 వేలకు పైగా ఉంటారు. వీరందరిపై ఒక్కో ప్రయాణికుడిపై రూ.30 చొప్పున అదనపు భారం మోపారు. ఖమ్మం నుంచి ఒక ప్రయాణికుడు హైదరాబాద్ వెళ్లి వస్తే రూ.60 అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. ఇది పేద, మధ్య తరగతి ప్రయాణికులకు అదనపు భారం అవుతున్నది.

ఖమ్మం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

3 టోల్‌ప్లాజాలు.. రూ.30 అదనం

నేషనల్ అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ రేట్లను పెంచడంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా టోల్‌ప్లాజా యూజర్ చార్జీలను పెంచింది. పెరిగిన రేట్లు ఈ నెల 9వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. టోల్‌ప్లాజాలు ఉన్న రూట్లలోనే కాకుండా అన్ని రూట్లలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజాల మీదుగా వెళ్లే ప్రయాణికుల నుంచి అదనంగా పది రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు 3 టోల్‌ప్లాజాలు ఉన్నవి. ఖమ్మం నుంచి సూర్యాపేటకు ఒకటి, సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు రెండు టోల్‌ప్లాజాలు ఉన్నవి. అంటే ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఒక్కో టికెట్‌కు అదనంగా రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. సూర్యాపేట వరకు రూ.10 వసూలు చేస్తున్నారు. టోల్ లేని రూట్లలో కూడా రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తుండడం గమనార్హం.

3 వేల మంది విద్యార్థులపై భారం

దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుదిబండను మోపింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఇంటర్ విద్య కోసం పట్టణాలకు వెళ్తుంటారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, రెక్కాడితే డొక్కాడని పేద విద్యార్థులు ప్రతిరోజు పట్టణాలకు వెళ్లి చదువుకొని తిరిగి సాయంత్రానికి ఇంటికి వస్తారు. వీరందరూ ఆర్టీసీ కల్పించే రాయితీ బస్సుపాసులపైనే ఆధారపడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో సుమారు 3 వేల మందికి పైగా విద్యార్థులు ఆర్టీసీ బస్సుపాసులు కలిగి ఉన్నారు. అలాంటి వారిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 20 శాతం అదనపు చార్జీలను పెంచింది.

టోల్ పేరుతో చార్జీల పెంపు సరికాదు..

పేదల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. అదే పేదలు ప్రయాణం చేసే ఆర్టీసీ చార్జీలు పెంచడం సరైంది కాదు. టోల్‌చార్జీలు పెంచితే ఆర్టీసీ చార్జీలు ఎందుకు పెంచాలి? హైదరాబాద్ వెళ్లి వస్తే రూ.60 అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలి.

– కళ్యాణ్, ఖమ్మం

చార్జీలు పెంచడం అన్యాయం

టోల్‌ప్లాజాలు ఉన్న రూట్లలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడం అన్యాయం. ఎక్స్‌ప్రెస్ లాంటి బస్సుల్లో హైదరాబాద్ వెళ్లాలంటే సీట్లే ఉండవు.. ఐనా అదనంగా చార్జీ చెల్లించాల్సి వస్తున్నది. టోల్‌రేట్లు పెరిగితే ఆ భారం ప్రయాణికులపై వేయడం ఎంతవరకు సబబు.

– నందవిహార్, ఖమ్మం

విద్యార్థులు ఏం పాపం చేశారు..

విద్యార్థుల బస్సుపాసుల రేట్లను పెంచిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వారు ఏ పాపం చేశారు. పేదవర్గాలకు చెందినవారే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తారు. అలాంటి వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు భారం మోపడం తగదు. అది కూడా ఒకేసారి 20 శాతం పెంచడం చాలా దుర్మార్గం.

– టి.లక్ష్మణ్, పీడీఎస్‌యూ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

ఇల్లెందులో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దిండిగాల రాజేందర్ తదితరులు

సార్ యాదిలో..

ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి
విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, విద్యారంగంలో మార్గదర్శి అయిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 14వ వర్ధంతిని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం ఆయన పడిన శ్రమను గుర్తు చేసుకున్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు అన్ని రంగాల్లో జరుగుతున్న అన్యాయంపై ఎలుగెత్తి చాటారని, తెలంగాణోద్యమ సమయంలో కేసీఆర్ వెంట ఉండి నడిపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ పూలమాల వేసి నివాళుర్పించారు. –నమస్తే నెట్‌వర్క్

జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలి

వద్దిరాజు, నామా

ఖమ్మం, జూన్ 21 : ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తికి మారుపేరు, సామాజిక న్యాయానికి నిలువెత్తు సాక్ష్యం, విద్యారంగంలో మార్గదర్శి అయిన ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని సమాజసేవకే అంకితం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు తన సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు.

నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

స్థాయీ సంఘం సమావేశంలో ఎంపీ వద్దిరాజు

సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జూన్ 21 : ఆయిల్, గ్యాస్ ఉత్పత్తులను వినియోగదారులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యతకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు తమ అధ్యయన యాత్రలో భాగంగా శనివారం కర్ణాటకలోని కొడగు(కూర్గ్)లో పర్యటించారు. చైర్మన్ సునీల్ తర్కరే అధ్యక్షతన మెడికెరి(మెరికర) పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి కల్తీకి తావులేకుండా, ప్రమాదాలకు చోటివ్వకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మానసిక ఆరోగ్యరంగానికి తెలంగాణ మార్గదర్శకంగా నిలవాలి

వృద్ధుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి
మమత సైకియాట్రీ-2025 సదస్సులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్

రాష్ట్రస్థాయి సైకియాట్రీ సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం, జూన్ 21 : మానసిక ఆరోగ్యరంగానికి తెలంగాణ రాష్ట్రం మార్గదర్శకంగా నిలవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఖమ్మం జిల్లాకేంద్రంలోని మమత కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మానసిక వైద్యుల సదస్సు జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'జెరియాట్రిక్ సైకియాట్రీ' అనే అంశంపై రాష్ట్ర సదస్సును మమత కళాశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఎంతో ప్రాధాన్యమైన అంశంగా పువ్వాడ అజయ్ పేర్కొన్నారు. దేశ జనాభాలో వృద్ధుల నిష్పత్తి వేగంగా పెరుగుతోందని, వారి ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం, డిప్రెషన్, డిమెన్షియా వంటి వాటిపై దృష్టి సారించి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా జెరియాట్రిక్ సైకియాట్రీలో పరిశోధనలు, చికిత్సా విధానాలు, సామాజిక వ్యవస్థలపై మేధోమదనం జరగడం ద్వారా వృద్ధుల మానసిక ఆరోగ్య సంరక్షణలో మన పాత్రను బలపరుచుకోవచ్చుననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సదస్సులో ఐపీఎస్‌టీఎస్‌బీ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ నరేన్ రాజ్, ఐపీఎస్ సౌత్ జోనల్ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జార్జ్ రెడ్డి, ఇండియన్ సైకోయేటిక్ సొసైటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాదరావు, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సతీశ్‌బాబు, డాక్టర్ నారాయణరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆకుల విశాల్, డాక్టర్ అనిత పాల్గొన్నారు.

కులవృత్తులను కాపాడాలి

ఖమ్మంలో నాయీ బ్రాహ్మణుల భారీ ర్యాలీ

నినాదాలు చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఖమ్మం, జూన్ 21 : తరతరాలుగా కులవృత్తులను నమ్ముకొని అనేక జాతుల ప్రజలు జీవిస్తున్నారని, కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులు యలమందల జగదీష్, గుండ్ల పల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి బల్లేపల్లి వరకు నాయీ బ్రాహ్మణులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవృత్తులను కాపాడడానికి ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా చదువు, ఉద్యోగాలను వదిలేసి ప్రజాశ్రేయస్సు దృష్ట్యా కులవృత్తినే నమ్ముకొని జీవన విధానాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కానీ కొన్ని కార్పొరేట్ శక్తులు కులవృత్తులను కొల్లగొట్టేందుకు కార్పొరేట్ సెలూన్లను ఏర్పాటుచేసి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సెలూన్‌లు లాభాల వరకే పని చేస్తాయని,ఇది సమాజానికి మంచిదికాదని హితవు పలికారు. ప్రజలతో మమేకమై ప్రతి కార్యక్రమంలో కులవృత్తులను కాపాడుకుంటూ ప్రజాసేవలో భాగంగా పనిచేసే కులాల వారికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్పొరేట్ శక్తులకు అవకాశం ఇస్తే మంచిచెడులకు అవకాశమే ఉండదన్నారు. కార్పొరేట్ సెలూన్లను తొలగించే వరకు పోరాడుతామని, దీనిని జిల్లావ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి కులవృత్తులను కాపాడుకుంటామన్నారు. కులవృత్తులపై ఆధారపడిన వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని ముగ్గురు మంత్రులకు విన్నవించామని వారు సానుకూలంగా స్పందించారని జగదీష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నాయకులు, నగర సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో టైపిస్టు

- రూ.2,500 లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కంప్యూటర్ ఆపరేటర్(టైపిస్టు) నవక్రాంత్

బూర్గంపహాడ్, జూన్ 21 : రేషన్ కార్డుకు సంబంధించి అప్‌లోడ్ ప్రాసెస్ కోసం ఓ టైపిస్టు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి చెందిన ఓ వ్యక్తి రేషన్ కార్డుకు సంబంధించి అప్‌లోడ్ ప్రాసెస్ కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్(టైపిస్టు) సీహెచ్.నవక్రాంత్‌ను సంప్రదించాడు. ఈ క్రమంలో అతడు రూ.4 వేలు డిమాండ్ చేయగా.. రూ.2,500 ఇస్తానని సదరు బాధితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించి పరిస్థితిని వివరించాడు. వారు పన్నిన పథకం ప్రకారం శనివారం కార్యాలయంలో టైపిస్టుకు రూ.2,500 లంచం ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తన బృందంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా లంచం అడిగితే 1064 లేదా 9154388981 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ రమేశ్ తెలిపారు. కాగా.. ఏడాది క్రితం తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా విధుల్లో చేరిన నవక్రాంత్ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పలు ఆరోపణలున్నాయి.

పదకొండేళ్లలో మూడుసార్లు దాడులు

బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో 11 ఏళ్ల కాలంలో ఏసీబీ అధికారులు మూడుసార్లు దాడులు నిర్వహించారు. 2014లో అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ సుంకర శ్రీనివాస్, టైపిస్టు దినేశ్‌లు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు భూమికి సంబంధించి ఆన్‌లైన్ చేయడం కోసం లంచం తీసుకుంటుండగా అప్పటి ఏసీబీ డీఎస్పీ సాయిబాబా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2018లో డీటీగా పనిచేస్తున్న భరణిబాబు సారపాక భాస్కర్‌నగర్ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇసుక తోలకాలకు అనుమతి ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అదే అధికారి ఇటీవల చర్లలో విధులు నిర్వహిస్తుండగా మరోసారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా ఏసీబీ అధికారులు టైపిస్టు నవక్రాంత్ లంచం తీసుకుంటుండగా పట్టుకొని అరెస్టు చేశారు.

పవర్ ప్లాంట్ రంగంలోకి సింగరేణి

- 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం
- డీపీఆర్ తయారీకి వ్యాప్కోస్ సంస్థకు పనుల అప్పగింత
- రాష్ట్రంలోనే ఇదే తొలి పీఎస్పీ : సింగరేణి సీఎండీ బలరాం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 21 : వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ విద్యుత్ ఉత్పాదన రంగంలోకి అడుగిడింది. ఇప్పటికే థర్మల్, సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సంస్థ రామగుండం-1 ఏరియాలో మూతబడిన మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ గనిని వాటర్ సంపు ఆధారంగా పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్(పీఎస్పీ) ఏర్పాటుకు పూనుకుంది. దీనిపై ప్రాజెక్టు రిపోర్టు రూపొందించడానికి ప్రభుత్వరంగ సంస్థ వ్యాప్కోస్ లిమిటెడ్‌కు బాధ్యతలు అప్పగిస్తూ లెటర్ ఆఫ్ అవార్డును అందజేసినట్లు సీఎండీ బలరాం వెల్లడించారు. ఈ తరహా ప్రాజెక్టు ఇప్పటివరకు రాష్ట్రంలో ఎక్కడా చేపట్టలేదని, సింగరేణి సంస్థ దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టడమే కాక విజయవంతంగా నిర్వహిస్తుందన్న నమ్మకం తమకు ఉన్నదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ అప్పగించిన బాధ్యతల ప్రకారం వ్యాప్కోస్ సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపు ఆధారంగా 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి అధ్యయనం చేస్తోంది. జియోలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతోపాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు, రక్షణ చర్యల వంటి విషయాలపై సమగ్ర అధ్యయనం చేసి డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, నిర్మాణ ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ అమ్మకాలకు గల అవకాశాలను డీపీఆర్‌లో పొందుపర్చనున్నారు. ప్రస్తుతం మేడిపల్లి ఓసీలో సుమారు 157 మీటర్ల లోతున భారీ నీటి సంపులో ఏడాది పొడవునా భారీ పరిమాణంలో నీటి నిల్వ ఉంటుంది. ఈ నీటిని ఉపరితలంపై నిర్మించనున్న దాదాపు ఇదే పరిమాణం గల మరో భారీ నీటి రిజర్వాయర్‌లోకి పగటి పూట సోలార్ విద్యుత్ ద్వారా పంపింగ్ చేస్తారు. ఇలా పగటి పూట నింపిన నీటిని భారీ పైపుల సహాయంతో రాత్రివేళ కిందికి పంపిస్తూ ఆ జలశక్తి ద్వారా మధ్యలో ఏర్పాటు చేసిన టర్బైన్లను తిప్పడం వల్ల విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం జరిగిన ఒప్పంద సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ సుభాని, జీఎంలు మనోహర్, సుబ్బారావు, సంబంధిత జీఎంలు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు పోరాటాలు

- 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య
- ఖమ్మంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు ప్రారంభం

ఖమ్మంలో జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ఆర్.లక్ష్మయ్య

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 21 : ఆర్టీసీ పరిరక్షణ, కార్మిక చట్టాల రక్షణ కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర 4వ మహాసభలు శనివారం ఖమ్మంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. తొలుత నాయకులు నేపాల్‌దేవ్ భట్టాచార్య, యర్ర శ్రీకాంతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ 2019 మోటార్ వాహన చట్టం సవరణలతో కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఆర్టీసీ సంస్థలకు సమాధి కట్టే సవరణలు చేసిందని ఆరోపించారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లు, అగ్రిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లు, అగ్రిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ పేరుతో ఊబర్, ఓలా వంటి సంస్థలతోపాటు బహుళజాతి రవాణా సంస్థలు కూడా భారత రవాణా రంగంలో చొరబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటం విజయం సాధించినట్లుగా, భారత కార్మిక వర్గం కూడా తమకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ కార్మిక, కర్షక మైత్రితో సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీలోని అన్ని కార్మిక వర్గాలు పాల్గొనాలని ఆయన కోరారు. మహాసభలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, కార్యదర్శి గడ్డం లింగమూర్తి, వివిధ సంఘాల నాయకులు అశ్వత్థామరెడ్డి, పాటి అప్పారావు, హనుమతరావు, వీఎస్ రావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.